మాలతి

రాయసము వెంకటశివుఁడు గారు, ఎం. ఏ, ఎల్. టి.

కొలఁది కాలముక్రిందట నే నొకకార్యార్థము విజయవాటికకు పోవుట తటస్థించెను. అపు డొక స్నేహితునియింట బస చేసితిని. ఒకనాఁడు వేకువనే పడక విడిచి మేడవసారాలోనికి వచ్చి వీథివంకఁ జూచుచుండఁగా, పచ్చని చీరఁ గట్టి, మేలి ముసుఁగు వైచు

కొని, ఏటిలో స్నానముచేసి, జలకలశము చేత నుంచుకొని యింటికిఁ బోవుచుండెడి స్త్రీ యొకతె గానవచ్చెను. ఆ వేడియ ధరించిన చక్కని పసుపుపచ్చనిచీర, బంగరుకాంతులీనెడి యాసహజ సుందరశరీరమునకు వన్నె తెచ్చుటకుఁ గాక చూపఱ దృష్టిదోషము దగులకుండుటకుఁ గా నిడిన రక్షవలెఁ దోఁచెను. అపుడే వియత్పథము నలంకరించుచున్న వెలుఁగుఱేని లేఁత యరుణకాంతు లాకాంత ముఖసరోజమునకు నైసర్గికముగ లేని సోయగ మేమియుఁ గలిగింప నేరకున్నను ఆలలితాంగి చేతుల నలరారు రంగుగాజులను, జలకలశమునుమాత్రము తళుకుబెళుకులతోఁ దాండవింపఁజేయుచుండెను. ఆంధ్రవధూటియొక్కయు, నన్యదేశపు వనితయొక్కయు లక్షణము లాసుందరియందుఁ గానవచ్చెను. తెలుఁగుజాతిస్త్రీయే యైనయెడల, పచ్చని చీరయు, మేలిముసుఁగు నెట్టులు వచ్చెను? నగలును, నగలుంచుకొనినరీతియుఁ జూచినచో నాంధ్రభామినియే యనవచ్చును. ఆ నెలఁతవయస్సు నిర్ధారణచేయుట సులభసాధ్యము కాదు. యౌవనము విడిపోవ సాహసించుచున్నను, సోయగముమాత్రి మాతన్వంగితోడి సంశ్లేషమును వదలఁజాలకుండునటులుఁ దోఁచెను.

ఆ స్త్రీరత్న మెవ్వరో, తదీయజన్మస్థల మేదియో గ్రహింపవలయు నను కుతూహలము ప్రేరేపింప నామిత్రుని నే నంత నడిగితిని. అతఁడు చిరునవ్వు నవ్వి, "ఓహో! మాలతియా! ఆపుణ్యవతి నామిత్రుఁడగు మురహరిరావుభార్య. ఆయువిదచరిత్రము వినఁదగినదియే", యని నా కది యివ్విధమున వాక్రుచ్చెను.

మాలతి బాల్యదినములు

ఈకాంతారత్నము ఓఢ్రదేశపుస్త్రీ. తలిదండ్రులు గౌడబ్రాహ్మణులు. జన్మస్థలము గంజాముమండల మందలి బొమ్మాళి. ఇరువదియైదు వత్సరముల క్రిందట బొమ్మాళి గ్రామమునందలి స్థితిమంతులలో విశ్వనాథపాఢీ యొకఁడు. ఈయనకు సంవత్సరమున కిరువదిగరిసెల ధాన్యము వచ్చు భూవసతి గలదు. కుగ్రామనివాసులగు తక్కినవారివలె విశ్వనాథపాఢీ తనసొమ్మును వ్యర్థవ్యయముల వెచ్చఁబెట్టక కుటుంబపోషణమునకును, పిల్లల విద్యాభివృద్ధికిని నుపయోగించుచుండును. ఆగ్రామమునకేతెంచు నతిథులకును అభ్యాగతులకును పాఢీగారి గే

హామే శరణ్యము. పాఢీ తనకుఁదీఱికయున్న కాలమంతయు వేదాంతగ్రంథపఠనమునందు వినియోగించును.

విశ్వనాథపాఢీ కిరువురు బిడ్డలు. వారిలోఁ బెద్దవాఁడు శశిభూషణుఁడు. ఈయనకంటె నేడేనిమిది సంవత్సరములు చిన్నది యగు మాలతి రెండవది. అన్నయుఁ జెల్లెలును వయస్సున జాల వ్యత్యాసము గలవారయ్యును, చిలుకగోరువంకలవలె మిగుల నన్యోన్యతతో నుందురు. అన్న గ్రామపాఠశాలకుం బోవునపుడు విడిచి యింట నుండనొల్లక చిన్నిచెల్లెలు వానిని వెన్నాడుచుండును. అన్న యేపనిచేసిన చెల్లెలు నది చేయవలసినదే. కావుననే, మాలతి కెప్పుడు అక్షరాభ్యాసముచేసిరో తెలియదు. మొన లక్షరాభ్యాసకర్మయే యెఱుఁగదని చెప్పవచ్చును. కర్మయోగ మక్కఱలేకయే యొక్కొకతఱి జ్ఞానప్రాప్తి సంఘటిల్లునను న్యాయమున కా బాలిక విద్యాపాకమే తార్కాణము. ఇంతియె కాదు. అజ్ఞానావస్థ తొలంగకమునుపే యాబాలకు జ్ఞాన మంకురింపసాగెను. నేలమీఁదను పలకమీఁదను వ్రాసివ్రాసి వ్రేళ్లు మొద్దుపడి యన్న నేరువఁగలిగిన పద్యములు పాఠములును మాలతికి సులభముగనే కంఠస్థము లయ్యెను.

దినదినప్రవర్ధమానయగుచున్న శశిభూషణునివిద్యకొఱకు పాఢీ యంత సొంతగ్రామము విడిచి కుటుంబముతో బ్రహ్మపురముఁ జేరెను. అచటమాత్రము మాలతి విద్యాభ్యాసమున కనువగు బాలికాపాఠశాల కలదు. ఇప్పుడా బాలిక క్రమముగఁ బాఠశాలకుఁ బోయి, విద్యనేర్చి తోడిబాలికలకంటె నెక్కుడుబుద్ధికుశలతను గాంచియుండెను.

కొంతకాలమున కచటి కళాశాలలో విద్యాపరిపూర్తిచేసిన శశిభూషణునికిఁ జేరువనున్న విజయనగరములోఁ గాక, దూరస్థమగు రాణ్మహేంద్రవరమునఁ గళాశాలలో విద్య నేరువవలెనని యభిలాష గలిగెను. చిన్నతనమునుండియు నతఁడు గోదావరీనది యెంతో రమ్యమైనదనియు, మాహాత్మ్యముగలదనియు వినుచుండెను. ఇప్పుడానదీమతల్లిని కన్నులకఱవుదీఱునట్టుగ సందర్శించి, యందలి పావనోదకములఁ గ్రోలి, తత్తీరమందలి రాజమహేంద్రవరమునఁ దాను విద్యాస్వీకారముఁ జేయవలయునని యాతనికి సంకల్పము గలిగెను.

మొట్టమొదట పాఢీయును ఆయనభార్యయును దీనికొప్పుకొనకున్నను, తుదకుఁ గొమరునిమక్కువ చెల్లింపనియ్యకొనిరి.

గౌతమీతీరమున కేఁగి, యచటికళాశాలలోఁ జేరి చదివి, పిమ్మట సెలవుల కింటి కేతెంచియున్నయన్నవలన మాలతి రాజనరేంద్రునిపట్టణపుచింతలను వృత్తాంతములను వీనులలర వినఁ దొడంగెను—సోదరుని విడిచియుండు టామె కిదివఱకే మిగులఁ గష్టముగఁ దోఁచెను. అన్నయుఁ జెల్లెలును రాణ్మహేంద్రవరపు సొంపులను గుఱించియే రేయుంబగల్లు ముచ్చటించుకొనుచుందురు. ఇప్పుడాతనితోఁ దానును బయనముచేయ మాలతి సమకట్టెను. పెండ్లియాడువచ్చిన బాలనొక్కతె నన్నతో దూరదేశము పంపుట కాగృహస్థులు మిక్కిలి సంకోచించిరి. కాని శశిభూషణుఁడు, తానును జెల్లెలు నుండుటకన్నివిధములగు సదుపాయములు గల గృహమును, సహవాసులును, కుదిరి యుండుట నొక్కి చెప్పఁగా, జననీజనకులు వీరిప్రయాణమున కట్టకేల కొడఁబడిరి.

మాలతి చెలికత్తెలు

మాలతి కాంధ్రదేశపు సంగతులన్నియు మొదట క్రొత్తలే. గోదావరీనదీ విశాలజలప్రవాహము వీక్షించిన యాకలికి విశాలనయనము లెన్నఁడును నిమీలన మొల్లనట్టులు గానఁబడెను. ఇచటఁ దమదేశమునందు వలె స్త్రీలు రాణివాసమున నుండ నక్కఱ లేదు. ఇరుగుపొరుగు బాలికలతోఁ గలసి మాలతి యాటపాటలయందు వినోదించుచుండును. నానాఁట వారితోఁ గూడఁ దానును బాలికాపాఠశాలకు రాకపోకలు సలిపెను. తెలుఁగులిపి యదివఱకుఁ దనకుఁ దెలియకున్నను అచిరకాలములోనే యందు వ్రాయను చదువను మాలతికిఁ బట్టుపడెను. తొలుదొల్త తెలుఁగు బాలికలు మాలతివంకఁ దేఱిచూచుచు, ఆక్రొత్తపేరు వినుటకాశ్చర్యమొందుచు దూరదూరముననే యుండినను అంతకంతకు వారికి మాలతి ముఖ్యస్నేహితురాలయ్యెను. "వడ్డి" బాలికయని మొదట మాలతిని జూచి మూతి విఱచువారలే యిపుడా సుందరి సహవాసమున కాశింప మొదలిడిరి.

మొదట శశిభూషణుఁ డీక్రొత్తప్రదేశమునఁ జెల్లెలికి సహవాసినులు దొరకరని భయపడెను. తాను గళాశాల కేతెంచునపుడు మాలతి యింట నొంటరిగ

మండవలయునని యాతఁడు భీతి నొందెను. తలిదండ్రులను విడిచి యాయబల పరదేశమున నుండఁగలదా యని యతఁడు సంశయించెను. కాని యిపుడాతనికన్నులకల్లెడలను చెలియలి చెలికత్తెలే యగపడిరి. మాలతిమూలమునఁ దా నందఱికిని దగ్గఱబంధువగుచుండుట కాతఁ డెంతయు సంతసించెను. ఇంటను బాఠశాలలోను చెలికత్తెలు మాలతిచుట్టును పండ్లగంపచుట్టునువలె గుమిగూడి యుందురు. వారి కందఱికి మాలతిపట్ల నింత చెలిమిగలుగుటకుఁ గారణము లేకపోలేదు. మాలతి సుస్వభావముగలబాలిక. ఈ క్రొత్తదేశపుబాలిక యుచ్చారణము, పావడగట్టుకొనుట, జడముడుచుకొనుట మొదలగు చిన్నపను లన్నియుఁ దెలుఁగుబాలలకు వింతలే. క్రొత్త దీఱినవెనుక మాలతి చెలిమియే వారి హృదయముల నాకర్షించెను. గంజాము బాలిక లెట్లు పయఁట వేసికొనెద రని యొక చెలికత్తె యడుగును. తలదువ్వుకొనునపు డోఢ్రబాలిక లోరపాపట యెట్లు తీసికొందురని వేఱొకతె ప్రశ్నించును. వారిదేశమున బాలికలు జడలో ముడుచుకొను "చెట్టుసంపెంగ"పూవు లెటులుండునని యింకొకసహచరి యచ్చెరువొంది యడుగును. తెలుఁగుబాలికలు తన్ను వేయు లెక్కలేని యీప్రశ్నముల కేమియు విసివికొనక, వారికి మఱింత నోరూరునట్టుగ నుత్తరము లిచ్చునైపుణ్యము మాలతికే కలదు. వినినకొలఁది నింకను ఓఢ్రదేశమును గుఱించియే చెప్పుమని యామెచుట్టు వారు మూఁగుదురు. వట్టిమాటలలోనే కాక, చదువునందును మాలతి వారిని మించెను. కావుననే సెలవులకు ముందు చేయఁబడిన పరీక్షలో మాలతి తనతరగతి బాలికలలో మొదటి దగుట చేత, గొప్పబహుమానమును బడసెను.

శశిభూషణుఁడు

శశిభూషణుఁడును దన చెల్లెలివలెనే సహచరుల హృదయముల నాకర్షించెను. సామాన్యవిద్యార్థులవలె నతఁడు పఠనీయగ్రంథములే మోక్షదాయకములని నమ్మియుండువాఁడు కాఁడు. ఎంతో శ్రమ కోర్చి, సవిమర్శముగ సద్గ్రంథపఠనముఁ జేయును. ఇంతియ కాదు. అతఁడు విద్యాలాభము తనకొక్కనికే కాక, దేశీయు లందఱికిని జేకూఱవలెనను సదుద్దేశము గలవాఁడు. దేశక్షేమాభివృద్ధికరములగు కార్యములందుఁ బాల్గొనవలయుననుట యాతని ముఖ్యాశయము. కావుననే యాపట్టణమునందలి "సంఘోజ్జీవనసమాజము"న కాతఁడు సహాయ కార్యదర్శి యయ్యెను.

శశిభూషణుఁడు తాను జదువుకొనుట కేర్పఱచుకొన్న చిన్నగది రానురాను పిన్నలు పెద్దలు విద్యార్థులు విద్యాధికులును దీఱికసమయమునఁ గార్యాలోచనము సలుపుటకువచ్చు రచ్చపట్టయ్యెను. తాను గంజాముమండలమున నున్నప్పుడు ఆంధ్రులకును ఓఢ్రులకును గల వైషమ్యము లలంఘనీయములని శశిభూషణుఁడు తలంచుచుండెడివాఁడు. "కొమ్మాశ్రి బ్రాహ్మలు కొండగొర్రెలు"ని యాంధ్రుల నోఢ్రులును, "వడ్డివారు మడ్డివార"ని యోఢ్రులను దెలుఁగువారును గేలిచేసి యొండొరులను ద్వేషబుద్ధితో నిందించుటకు అతని కెఱుకయే. కాని యన్యదేశీయుఁడగు తా నాంధ్రదేశకేంద్రస్థానమగు నొకపట్టణమున నిపు డొంటరిగ నున్నను, తెలుఁగువారు తనయెడల నసూయ లేక మీఁదుమిక్కిలి తనతోఁ గలసిమెలసి యుండుట చూడఁగా, నాతని కాశ్చర్యము గలిగి, దేశహితైకకార్యములపట్ల నందఱ కేకీభావము గలుగునని యాతఁడు సిద్ధాంతము చేసికొనెను. భేదబుద్ధివదలి ప్రజాక్షేమము నొడఁగూర్చునట్టి దేశసేవ చేయుటకే యాతఁడు పూనియుండెను.

మురహరి

శశిభూషణపాఢీకిఁ గల తెలుఁగు మిత్రులలో మురహరి ముఖ్యుఁడు. ఇతనికి దేశోజ్జీవనకరములగు కార్యములపట్ల పాఢీకిఁగల యుత్సాహముకన్నను, పైకిమాత్ర మట్లు గానఁబడువాఁడు కాఁడు. శ్రోతలకు హృదయరంజకముగ పాఢీ యుద్రేకముతో సభలోఁ బ్రసంగించునపుడు, మురహరి పుల్లవిఱుపుమాట యొకటి నడుమఁ బ్రయోగించి, యుపన్యాసకునికాళ్లకు బంధములు గల్పించును. వాదనిర్వహణమందలి విజయము నభిలషించి మురహరి యిట్లు చేయువాఁడుకాఁడని యాయిరువురి హృదయముల నెఱిఁగిన మిత్రులకుఁ దెలియును. పాఢీవలె మురహరి వాచాటుఁడు కాఁడనియు, కార్యశూరుఁడనియు నందఱు నెఱిఁగియున్నారు.

ఒకనాఁటి సాయంకాలము గోదావరినదియొడ్డున చల్లగాలి సేవించుచు మురహరి శశిభూషణులు గూర్చుం

డి యుండిరి. మలయమారుతము వీచుచుండినను, గొప్ప విషయములను గుఱించి వీరికి తీవ్రచర్చ జరుగుచుండుట చేత మానసములు మాత్రము తహతహపడుచుండెను. ఇంకఁ గొలఁదికాలములోనే విద్యాపరిపూర్తియై యిరువురు నాపట్టణము విడిచి పోయెదరు. తాను బరీక్షలో జయ మొంది, యుద్యోగస్వీకారము చేసినతోడనే, లోకోపకారకార్యములందుఁ దనకుఁ గల యమితోత్సాహమను మహాప్రవాహమందు జనులహృదయములు మున్కలు వేయునటులు గావించెదనని శశిభూషణుఁడు పలికెను. మురహరి యట్లు ప్రసంగింప నొల్లక, తన యొద్దుపోడుగు ముందైన నంతియనుండుననియును, నిశ్చయముగ లోకము నుద్ధరింపఁగలవి మాటలకంటె పనులే యనియును వక్కాణించెను. అంత వారిద్దఱికిని ప్రబలమైనవాదము జరిగెను. కాని దానిపర్యవసానము, "శేషం కోపేన పూరయేత్" అనువిధముగఁ బరిణమింపక అది వారిహృదయములను మఱింతమిత్రభావముతోఁ గట్టునట్టిసూత్ర మయ్యెను. తుట్టతుదకు పాఢీ, "అటులైన యెడల నీ వీకార్యమునకుసిద్ధముగ నున్నావా?" యని యడుగఁగా, "మీ రిద్దఱుసిద్ధముగ నున్నయెడల, నేనును సిద్ధమే," యని మురహరి పలికెను. ప్రేమ యుట్టిపడునట్టులు నంత నామిత్రులొకరినొకరు కౌఁగలించుకొని, తమయిండ్లకు వెడలిపోయిరి.

అన్నచెల్లెండ్ర సంభాషణము.

ఆరాత్రి మాలతీ శశిభూషణులకుఁ గంటఁ గూర్కు రాలేదు. వారుమాటలసందడిని నిద్రమాటయే మఱచిరి. రాత్రి యగుట, తెల్లవాఱుట,—ఇవి రెండు మాత్రమే వారికన్నులకుఁ బొడఁగట్టెను. కాని, తెల్లవాఱు లోన నన్నయుఁ జెల్లెలును దీర్ఘకాలానుభవము వలనఁ గాని తేలని విషయములఁగూర్చి చర్చలను గావించుకొనిరి. ఆసోదరీసోదరులకు జరిగిన రహస్యసంభాషణ మంతయు నిచట వెలిపుచ్చ నక్కఱలేదు. ఇకఁ దెల్లవాఱు ననఁగా శశిభూషణుఁడు చెల్లెలు నిట్లు మాటాడుకొనిరి:—

శశిభూషణుఁడు:—"కాని, అమ్మాయీ! నీకాతని యందుఁ గలయనురాగము, ఇదివఱ కెన్నడును సూచింపనైన సూచింప లేదే?"

మాలతి:—"అవసరములేని ప్రసంగములకు అంగనలు పోఁగూడదని."

శశి:—"మనతలిదండ్రులు నీ కీవేసవిలో వివాహము చేయఁబూని యున్నారుసుమీ!"

మాలతి:—"నీ వేమి చేయఁ బూని యున్నావు?"

శశి:—"పెద్దవారలుండఁగా పిన్నవారేమిచేయఁగలరు?"

మాలతి:—"నాబోఁటిబోటు లిచ్చుసమాధానము విద్యాధికుఁడగు పురుషునినోట వినవచ్చుచున్నదే!"

శశి:—"కాదు మాలతీ! నీవు మనసిచ్చి ధారాళముగ మాటాడుము."

మాలతి:-"అన్నయే నాకీవిషయమున దారిచూపవలెను."

శశి:—"ఐతే వినుము మురహరి నాకుఁ బ్రాణసమానము."

మాలతి:-"అన్నయ్యకు నాకును హృదయ మొకటియే."

శశి:—అతఁడే నీకుఁ దగినవరుఁడని భావించెదను."

మాలతి:—"ఐన?"

శశి:—"మనజననీజనకులు పూర్వాచారపరాయణు లగుటచేత ఓష్ఠవనువు నాంధ్రవరుని కీయరని నా భయము."

మాలతి:—"భయపడి యేమి లాభము?"

శశి:—"కాఁబట్టి యేమి చేయవలెను?"

మాలతి:—"నీకుఁ దెలియదా?"

శశి:—"అంతరాత్మ ప్రబోధముముందట జననీజనకుల పట్ల మనకున్న విధుల నొక్కింత తగ్గింపవచ్చును."

మాలతి:—"ధైర్యముతో మెలఁగఁగలవారే యిట్లుచేయవలెను."

శశి:—"చెల్లీ! ఈవిషయమున నిఁక మాటలకంటెఁ గ్రియలే ముఖ్యమని నేను మురహరియుఁ దలంచుచున్నాము."

మాలతి:—"నన్నుఁగూడ మీలోఁ జేర్చుకొనండి."

శశిభూషణుఁడు తనచెలియలి హృదయ మెఱిఁగి, తనప్రాణమిత్రమగు మురహరిప్రణయము తా నొనఁగూర్పఁగలిగినందున కెంతయు సంతసించెను.

మాలతి వివాహము

ఈ సంభాషణము జరిగిన రెండుమూఁడు దినముల పిమ్మట నొకనాఁటి ప్రాతఃకాలమున రాజమహేంద్రవరమున గోపాలస్వామి దేవళమునందలి ముఖమండపము

పచ్చనితోరణములతోను, సుందరమగు రంగుపూలతోను నలంకరింపఁబడియుండెను. ఒకమూల వాద్యములు మ్రోగుచుండెను. సదస్యులలోఁ జాలమంది హూణవిద్యాభ్యాసము చేయుయువకులును, సంఘసంస్కరణాభిమానులును, వయస్సువచ్చిన స్త్రీలకంటె బాలికలు మెండుగ నుండిరి. పురోహితుఁడు గ్రుక్కత్రిప్పక, మంత్రము పఠించుచుండెను. అచటఁ గూడినవారెల్లరును వరుని విద్యాబుద్ధులను గుఱించియు, వధువురూపగుణాధికతను గూర్చియుఁ, బ్రశంసించుకొనుచుండిరి. ఎట్టకేలకు వివాహము పరిసమాప్త మయ్యెను. సదస్యులు మంత్రములు చదివి యాశీర్వాదము లొసంగిరి. అగ్రతాంబూల మెవరి కీయవలెనను సంగతి యపుడాలోచనకు వచ్చెను. అంత నచటి ప్రముఖుల యనుమతిచొప్పున, ఒకప్రక్కఁ గూర్చుండియుండు వయోవృద్ధునొద్దకు నూతనవధూవరులు వచ్చి, ఆయనకు మ్రొక్కి, ఆయనచేతిలో నగ్రతాంబూలము నుంచిరి. ఆయన మంత్రములమూలమున నాశీర్వదింపక పొంగి పొరలివచ్చు నుత్సాహమున నాలుక తడఁబడుచుండ, మాటి మాటికిని వచ్చుదగ్గు నాఁపుకొనుచు తేటతెలుఁగు మాటలతో నిట్లు పలికెను. "మురహరీ! మాలతీ! హిందూజాతీయైక్యమునకును, దేశాభివృద్ధికిని, పరమసాధనమగు నంతర్జాతీయవివాహపథమున మీరు మార్గదర్శులై ధన్యులైతిరి. మీరు నేఁడు చూపించిన ధైర్యమున కీశ్వరుని నేను మిగుల వినుతించుచున్నాను. శశిభూషణా! నీవుకనఁబఱచిన కార్యోత్సాహ మెంతయు శ్లాఘనీయమైనది!" అని పలికి, తాను రచించినగ్రంథరాజము లానూత్నదంపతులకు మొదటికట్నముగ నొసంగెను. ఈయనయే, సంఘసంస్కరణోద్యమము నుద్ధరించుటకును, దేశోపకారకార్యములు జరుపుటకును తనసర్వస్వమును ధారపోసిన పంతులుగారని యందఱు చెప్పుకొనిరి. వధూవరుల నభినందించుచు సదస్యులలో ననేకులు బహుమతులతో వారలను ముంచివేసిరి.

వివాహవేదికనుండి నూతనదంపతులు క్రిందికి దిగుచుండఁగనే, యపుడే వచ్చిన పొగబండినుండి దిగి, పెండ్లివారెక్కడనని యడుగుచు గుండెలు బాదుకొనుచు నిద్దఱు ముదుసలు లచటికి విచ్చేసిరి. వీరు విశ్వనాథపాఢీయును, ఆయనభార్యయును, అని చెప్పవలయునా? తమయనుమతిలేకయే కుమారుఁడు చేయనున్న యీ యశాస్త్రీయమును అనాచారము నగు వివాహముసంగతి తంత్రీమూలమున నెవ్వరో క్రిందటిదినముననే వారికిఁ దెలియఁబఱచిరి! లేడిగుంపును దఱియవచ్చుపెద్దపులివలె పాఢీ యాగ్రహావేశపరవశుఁడై, తనతనయులను సమీపించెను. కాని వధూవరులు తత్క్షణమే యాయనపాదముల కెరఁగి, యాయనదీవనలఁ బడసి కాని లేవమని చెప్పిరి. నూతనదంపతులను దీవింపుఁడని సదస్యులొక్కపెట్టునఁ గేకలిడిరి. అంత పాఢీగారియొక్కయు, ఆయన భార్యయొక్కయు దీవనలందుకొని ఆక్రొత్త పెండ్లికొడుకును పెండ్లికూఁతురును, అప్పుడే పట్టాభిషేకమునొందిన రాజును దేవేరియువలెఁ దేజరిల్లిరి. కొమరుని కొమరితను, గౌఁగిలించికొని, పాఢీయు భార్యయు నానందబాష్పములు విడిచిరి వారి కోపానల మంతటితోనే యుపశమించెను.

తరువాతి వృత్తాంతము విపులముగఁ జెప్పనవసరము లేదు. విశ్వనాథపాఢీగారిపుడు వయోవృద్ధులై యున్నారు. వేదాంత కాలక్షేపములు సలుపుచు నీయన, "ఆర్యజనైక్యము" అను గ్రంథరాజము రచియించుచున్నారు. దానిలో గౌడ ద్రావిడు లిరువురును ప్రాచీనార్యులసంతతివారలే యనియును, వివాహసంబంధములు భోజన ప్రతిభోజనములును వారలలో నుండుట న్యాయమనియును వారు నిర్ధారణచేయుచు, దీనికి వలసిన శాస్త్రప్రమాణములను జూపించుచున్నారు. శశిభూషణుఁడు ఆంధ్రదేశమం దొకగొప్ప యుద్యోగమున నున్నాఁడు. దేశములోని సంఘసంస్కర్తలలో వీరు పేరెన్నికగన్నవారు. మాలతీ మురహరులు విజయవాటికయందుఁ గాఁపురమున్నారు. న్యాయవాదివృత్తిఁ జేకొని మురహరి ఋజువర్తనముచేతను పరోపకారపారీణతచేతను నందఱిచే గౌరవింపఁ బడుచున్నాఁడు. వీరి పుత్త్రులు పుత్త్రికలును, ఆంధ్రులకు ఓఢ్రులకును గలసుగుణసౌశీల్యములు గలిగి వర్ధిలుచున్నారు. మాలతి యిపుడు బెజవాడలో హిందూకాంతలజ్ఞానాభివృద్ధికై యనేకవిధములఁ గృషిచేయుచున్నది. మాలతి కుసుమపుఁ బరిమళలహరులవలె మాలతి గుణగణములు, ఎల్లెడల వ్యాపకములై, స్త్రీ జాత్యుద్ధరణమునకుఁ దోడ్పడుచున్నవి.